ఈనాడు
జగిత్యాల
శుక్రవారం 11 ఆగస్టు 2017 16 పేజీలు

పోచంపాడుకు గులాబీ శ్రేణులు



జెండా ఊపి ట్రాక్టర్ర్యాలీ ప్రారంభిస్తున్న ఎంపీ కవిత

జగిత్యాల పట్టణం: ఎస్సారెస్పీ పునరుజ్జీవ సభ కోసం జగిత్యాలలో ట్రాక్టర్ల ర్యాలీని ఎంపీ కవిత గురువారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభించారు. సభ కోసం గత రెండు రోజుల కిందటే పట్టణంలో మకాం వేసిన కవిత జగిత్యాల నియోజకవర్గం నుంచి జనం తరలింపులో ప్రత్యేక శ్రద్ధ వహించారు. కాగా కవిత ఈసారి ముఖ్య నాయకులెవరినీ కలవకుండానే ఆయా మండలాల ప్రజాప్రతినిధులతో స్వయంగా మాట్లాడి జన సమీకరణ చేశారు. ప్రత్యేకంగా ఇతర జిల్లాల నుంచి వాహనాలు రప్పించి జగిత్యాల నియోజకవర్గంతో పాటు మల్యాల, కొడిమ్యాల మండలాల నుంచి ప్రజలను సభకు పంపించేందుకు ఏర్పాట్లు చేశారు.

శ్రీరామ జనసాగరం 8,9లో



- 38 శాతం లోటువర్షం... 60 శాతంగానే పంటలు
- జిల్లాలో ఈనెలాఖరు వరకు వరినాట్లకు అవకాశం

వానల్లేక అదును ఆలస్యం

వ్యవసాయాధారితమైన జగిత్యాల జిల్లాలో వానాకాలం పంటలసాగు ఆశించినట్లుగా గరిష్ఠ విస్తీర్ణానికి చేరుకోవటంలేదు... జిల్లాలో ఆశించిన మేరకు వర్షపాతం నమోదు కాక, కాలువనీళ్లు వచ్చే అవకాశం లేక సాగు అసాంతం భూగర్భ జలాల ఆధారంగా నెమ్మదిగా విస్తరిస్తోంది... జూన్‌తో ఖరీఫ్ ప్రారంభమైనా ఇప్పటి వరకు 60 శాతం విస్తీర్ణంలోనే పంటలను వేయగా ఈ నెలాఖరు వరకు వరినాట్లకు, పలురకాలైన ఆరుతడికి అవకాశం ఉండటంతో పరిస్థితి అనుకూలిస్తే సాగు మరింతగా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు... గత సంవత్సరం ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లోనే భారీ వర్షాలు కురియగా ఈసారి కూడా వరుణుడు కరుణిస్తాడని అన్నదాతలు ఆశగాఉన్నారు...

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే

జిల్లాలో జూన్‌నుంచి ఇప్పటివరకు 536.9 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా 334.9 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. జిల్లాలోని 16 మండలాల్లో 29-59 శాతం లోటు వర్షపాతం నమోదు కాగా 2 మండలాల్లో 19 శాతం వరకు లోటు వర్షపాతం రికార్డయ్యింది. జులై చివరి వరకు 6.93 మీటర్ల కనిష్ఠ సరాసరి భూగర్భ జలమట్టం ఉండగా కొన్ని మండలాల్లో పైస్థాయిలో, మరికొన్ని మండలాల్లో చాలా లోతులో నీళ్లున్నాయి. జిల్లాలో 1,226 చెరువులు కుంటలకుగాను దాదాపు 27 శాతం నీటి వనరుల్లోనే ఆశించినట్లు వర్షపు నీరు చేరింది. మిగిలిన వాటిల్లో బొటాబొటిగానే నీరుండగా భూగర్భ జలమట్టం తగ్గటంతో ఇవి కూడా వెలవెలబోతున్నాయి. ప్రస్తుతం 24 గంటల విద్యుత్ సరఫరా, వరిపొలాలను దుక్కి చేస్తుండటంతో పెద్దఎత్తున భూగర్భ జలాలు ఇంకుతున్నాయి. పెగడపల్లి, కోరుట్ల, కొడిమ్యాల, మల్యాల, మేడిపల్లి, కథలాపూర్ తదితర మండలాల్లోని గ్రామాల్లో భూగర్భ జలమట్టం వేగంగా పడిపోతోంది. బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి 40 రోజులవుతున్నా ఇప్పటి వరకు గోదావరి ద్వారా ఎస్సారెస్పీలోకి ఏమాత్రం వరద నీరు రాలేదు. శ్రీరామ్‌సాగర్ గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 90.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.162 టీఎంసీల నీరు మాత్రమే ఉండటంతో ఆయకట్టుకు ఏమాత్రం నీరు వదిలే అవకాశం మిగతా2లో..

జిల్లాలో ఖరీఫ్‌లో ప్రధాన పంటల సాధారణ సాగు, రైతులు విత్తుకున్న విస్తీర్ణం వివరాలిలా ఉన్నాయి (హెక్టార్లలో)

పంటపేరు	సాధారణం	వేసినది
వరి	41,669	213,765 (నాట్లు వేసినది)
మక్క	22,702	19,215
పసుపు	12,880	11,818
కంది	2,097	2,014
పెసర	1,884	2,067
సోయాబీన్	9,963	3,020
పత్తి	16,024	13,793
మిరప	1,405	276
చెరకు	1,332	184

క్లస్టర్ కేంద్రాల్లో రైతు భవనాలు



ప్రభుత్వం సరఫరా చేసిన భూసార పరీక్ష కిట్లు

కొనసాగుతున్న స్థలాల అన్వేషణ

రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించడానికి క్లస్టర్ (వ్యవసాయ సముదాయ) కేంద్రాలను ఏర్పాటు చేసి మినీ భూసార పరీక్ష కేంద్రాలను మంజూరు చేసిన సర్కారు తాజాగా ఆయా కేంద్రాల్లో అన్ని వసతులతో రైతు భవనాలు నిర్మించాలని నిర్ణయించింది. వ్యవసాయ సముదాయ భవన నిర్మాణాలకు అవసరమైన స్థలాలను కేటాయించాలని జిల్లా పాలనాధికారి ద్వారా మండల రెవెన్యూ అధికారులకు ఆదేశాలు అందాయి. ఈ మేరకు అధికారులు స్థలాల ఎంపికకు కసరత్తు చేస్తున్నారు.

మెట్‌పల్లి, న్యూస్‌టుడే

జగిత్యాల జిల్లాలో 18 మండలాలు, 287 రెవెన్యూ గ్రామాలు, 327 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వ్యవసాయం చేసే రైతులు 1,11,345 మంది ఉండగా 1,22,970 హెక్టార్ల సాగు భూమి ఉంది. వ్యవసాయ శాఖ సేవలు రైతులకు మరింత అందుబాటులోకి తేవాలని అయిదువేల ఎకరాలకు ఒకటి చొప్పున క్లస్టర్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో జిల్లాలో 62 సముదాయ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వ్యవసాయరంగంలో భూసార పరీక్షలు కీలకం. భూసారం తెలియకుండా సాగుచేసి రైతులు నష్టపోతున్నారని భావించిన ప్రభుత్వం ప్రతి క్లస్టర్‌కు ఒక మినీ భూసార పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసి పరీక్ష కిట్లను మంజూరు చేసింది. భూసార పరీక్షల ఆధారంగానే పంటలను సాగు చేయాలని ప్రభుత్వం రైతులకు సూచించింది. జిల్లాకు 62 మినీ భూసార పరీక్ష కిట్లు మంజూరయ్యాయి. వచ్చే ఏడాది నుంచి ఎకరాకు రూ.4 వేల వంతున రెండు పంటలకు అందించాలని నిర్ణయించి అర్హులైన రైతులను గుర్తించడానికి గత నెలలో ప్రభుత్వం సమగ్ర సర్వే చేపట్టింది. సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. పంటలు పండించే రైతులతో గ్రామ కమిటీ, గ్రామాల కమిటీలతో మండల, మండలాల ప్రతినిధులతో జిల్లా, జిల్లా ప్రతినిధులతో రాష్ట్ర కమిటీలను ఏర్పాటుకు వ్యవసాయశాఖ అధికారులు రైతుల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వ్యవసాయాధికారులు జిల్లాలో 62 క్లస్టర్ కేంద్రాలకు ప్రభుత్వానికి ప్రతిపాదించారు.

కేంద్రాల నిర్వహణకు స్థలంలేక ఇబ్బంది

వ్యవసాయ సముదాయ కేంద్రాల నిర్వహణ బాధ్యతను ఏఈవోలకు అప్పగించింది. కేంద్రాల ఏర్పాటుకు స్థల సమస్య వేధిస్తోంది. ప్రస్తుతం గ్రామ పంచాయతీలు, సహకార సంఘాలు, మహిళా సంఘ భవనాల్లో మిగతా2లో..

స్థలాలు అప్పగిస్తే భవనాలు నిర్మిస్తాం

భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి




ఈ నెల 14 వరకు స్థలాలు కేటాయించమని కలెక్టర్ రెవెన్యూ అధికారులకు గడువు విధించారు. స్థలాలు అప్పగించిన వెంటనే భవనాలు నిర్మిస్తాం. భవన నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరయ్యాయి. క్లస్టర్ వల్ల వ్యవసాయ విస్తీర్ణాధికారులు రైతులకు అందుబాటులో ఉంటారు. భూసార పరీక్షలు త్వరిత గతిన అందుతాయి. భవనాలు నిర్మించడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

పుస్తకాలు రావు... పరీక్షలు ఆగవు

- ప్రభుత్వ పాఠశాలలకు అందని పాఠ్యపుస్తకాలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నేటికీ పాఠ్య పుస్తకాలు పూర్తి స్థాయిలో అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పుస్తకాలు లేకుండా పరీక్షలు ఎలా రాయాలని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. నూతనంగా ఉన్నత పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమం ప్రారంభించగా ఇప్పటికీ పుస్తకాలు లేక ఎఫ్‌ఏ-I పరీక్షలు రాయడం కష్టంగా మారింది. పాఠశాలల్లో పుస్తకాల కొరతపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.



రాయికల్, న్యూస్‌టుడే

జగిత్యాల జిల్లాలో 18 మండలాల్లో 1208 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 1,50,308 మంది విద్యార్థులు చదువుతున్నారు. కొన్ని మండలాల్లో కొన్ని తరగతుల ఆంగ్లమాధ్యమ పుస్తకాలు రాక పోవడంతో ఉపాధ్యాయులే తెచ్చి బోధిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని అధికారులు బడిబాట పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచినా దానికి అనుగుణంగా వసతులు లేక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఏడాది మార్చిలోనే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పుస్తకాలు అందజేయాల్సి ఉండగా ఇప్పటికీ కొందరికి పుస్తకాలు అందలేదు.

మండలంలో ఇది పరిస్థితి....

రాయికల్ మండలంలోని 53 పాఠశాలల్లో ఈ ఏడాది 4959 విద్యార్థులు చదవుతుండగా తెలుగు మాధ్యమంలో 1964, ఆంగ్ల మాధ్యమంలో 2899, ఉర్దూ మాధ్యమంలో 96 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల్లో 27,922 పుస్తకాలు రాగా మరో 2237 పుస్తకాలు రావాల్సి ఉంది. అత్యధికంగా 6వ తరగతి, పదో తరగతి విద్యార్థులకు ఆంగ్లమాధ్యమం పుస్తకాలు రాక పరీక్షలకు సన్నద్ధం కావడం ఇబ్బందిగా మారింది. మండలంలోని మైతాపూర్, ఆలూరు, రామాజిపేట, మూటపల్లి పాఠశాలల్లో ఆలస్యంగా ఆంగ్లమాధ్యమం అనుమతులు రావడంతో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో పాటు ప్రస్తుతం ఆంగ్లమాధ్యమ పుస్తకాలు అందలేదు. ఇప్పటికే పలు పాఠశాలల్లో ఎఫ్‌ఏ-1 పరీక్షలు నిర్వహించడంతో పాటు కొన్ని పాఠశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. నూతనంగా సీసీఈ పద్ధతిలో పాఠ్యంశాన్ని పూర్తిగా చదివి అర్థం చేసుకుని ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉండగా పుస్తకాలు లేక పోవడంతో పరీక్షలు నామ మాత్రంగానే సాగుతున్నాయి.

మార్చి నుంచి వార్షిక ప్రణాళిక ప్రారంభం కాగా నేటికీ పుస్తకాల కొరత ఇబ్బందులకు గురిచేస్తోంది. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల మిగతా2లో..

ప్రతిపాదనలు పంపించాం

శ్యాంసుందరాచారి, ఎంఈవో



కొత్తగా ఏర్పాటు చేసిన నాలుగు ఉన్నత పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమం పుస్తకాలతో పాటు మండలానికి 2257 పుస్తకాలు రావాల్సి ఉంది. పెరిగిన విద్యార్థుల సంఖ్య ఆధారంగా పుస్తకాలకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. వచ్చిన వెంటనే పుస్తకాలను పాఠశాలకు పంపించి విద్యార్థులకు అందజేస్తాం.

చల్‌గల్‌లో రైతుశిక్షణ కేంద్రం...!

- అధికారుల తాజా ప్రతిపాదన
- మార్కెట్‌యార్డుకు 10 ఎకరాలకు సిఫారసు

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: జగిత్యాల మండలం చల్‌గల్‌లోని వాలంతరి (భూమి, సాగు నీటి యాజమాన్య శిక్షణ, పరిశోధన సంస్థ) ప్రదర్శన క్షేత్రాన్ని పునర్‌వైభవానికి తెచ్చేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. నాలుగు దశాబ్దాలక్రితం ఏర్పాటు చేసిన ప్రదర్శన క్షేత్రాన్ని రైతులు, అధికారుల శిక్షణలకు వినియోగించేలా చర్యలను చేపట్టనున్నారు. ఇదిలాఉండగా ప్రదర్శన క్షేత్రంనుంచి మరో 10 ఎకరాల స్థలాన్ని మంజూరివ్వాలని కోరుతూ మార్కెటింగ్‌శాఖ జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి విన్నవించింది. ఐతే గతంలో ఇచ్చిన స్థలంనకు చెందిన డబ్బులు ఇవ్వనందున ఈసారి స్థలం మంజూరీపై వాలంతరి వెనకంజలోనేఉంది...

★ జగిత్యాల మండలం చల్‌గల్‌లో ఉత్తర తెలంగాణాలోని నాలుగు జిల్లాల రైతులు, అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు వాలంతరి ఆధ్వర్యలో 1974లో ప్రదర్శన క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 30 సంవత్సరాలపాటు శిక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రదర్శనతో విశేష సేవలను అందించిన క్షేత్రం క్రమంగా సేవలకు దూరమైంది. గతకొన్ని సంవత్సరాలుగా ఇక్కడ శిక్షణలను ఇప్పించటం పూర్తిగా మానివేశారు. యువరైతులకు ట్రాక్టర్ డ్రయివింగ్‌లో ఇచ్చే శిక్షణనుకూడా కొన్ని సంవత్సరాలుగా చేపట్టడంలేదు. శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలో నీటియాజమాన్యం తెలిపే సదస్సులు అటకెక్కాయి. ప్రస్తుతం కేవలం క్షేత్రం నిర్వహణ నిమిత్తమే పంటలను పండిస్తున్నారు.

★ సువిశాల స్థలంలో మామిడి, జామ, సపోట, బత్తాయి, ఉసిరి తదితర పండ్లతోటలు, సాగునీటివసతి, కాలువనీరు పారే సౌకర్యమున్నా క్షేత్రం నిర్వహణపై ఇన్నాళ్లూ ప్రభుత్వం శీతకన్ను వేసింది. ఉద్యోగుల ఖాళీలు, నిధులను విడుదల చేయకపోవటం తదితర కారణాలతో క్షేత్రం సేవలు మరుగునపడ్డాయి. మార్కెట్‌యార్డు, గోదాములు, రైల్వేలైనుకు స్థలంపోగా ప్రస్తుతం 80 ఎకరాల స్థలం మిగిలింది. వ్యవసాయ మార్కెట్‌కు ఇప్పటికే 23 ఎకరాల స్థలం ఇవ్వగా ఇందుకు చెందిన డబ్బులు తమకు ఇవ్వాలని వాలంతరీ కోరుతోంది. ఈ నేపథ్యంలో మరో 10 ఎకరాలు కావాలని మార్కెటింగ్‌శాఖ కోరటంతో తాజాగా స్థలానికి రూ. 1.19 కోట్లను చెల్లించాలని స్పష్టంచేసింది. వాలంతరికి రూ. 1.19 కోట్లను చెల్లిస్తే 10 ఎకరాల స్థలం మామిడిమార్కెట్‌కు కేటాయించే అవకాశముంది.

★ మార్కెట్‌కు 10 ఎకరాల స్థలమిచ్చినా మరో 70 ఎకరాలుంటుంది. జాతీయ రహదారిని ఆనుకునిఉన్న క్షేత్రంలో మామిడి, ఉసిరి, జామ, నిమ్మ తదితర తోటలుండటంతో గతంలో వ్యవసాయ వర్సిటీకి తీసుకోవాలనుకున్నా కుదరలేదు. తదుపరి ఉద్యాన వర్సిటీకి, జిల్లా కలెక్టరేట్‌కు, పోలీస్‌శాఖకు ఇవ్వాలనుకున్నా ఆచరణలోకి రాలేదు. ఈ నేపథ్యంలో ఉత్తర తెలంగాణా వ్యవసాయ శిక్షణ కేంద్రంగా చల్‌గల్ ప్రదర్శన క్షేత్రంను తీర్చిదిద్దాలని వాలంతరి అధికారులు నిర్ణయించి ఫైల్‌ను తయారుచేసి ప్రభుత్వానికి విన్నవించారు. గతంలో రైతుశిక్షణ కేంద్రానికి రూ. 3 కోట్లను కేటాయించిన పనులు చేపట్టగా నిధులు వెనక్కివెళ్లాయి. ఈ నేపథ్యంలో పునఃపరిశీలనతో రైతుశిక్షణ కేంద్రానికి మోక్షం కలిగే అవకాశముందని క్షేత్రం ఉపసంచాలకుడు బి.రవీందర్‌సింగ్, విస్తరణ అధికారి భూక్య సురేందర్‌నాయక్ పేర్కొన్నారు. ప్రస్తుతం వివిధ రకాలైన అభివృద్ధి పనులకు కొంత నిధులురాగా త్వరలోనే మిగిలిన అన్ని రకాల పనులను చేపట్టనున్నామని వివరించారు. ములుగు ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో చల్‌గల్ ప్రదర్శన క్షేత్రంలో ఉద్యాన పరిశోధనస్థానంను ఏర్పాటుచేసే ప్రతిపాదనలు కూడా కొనసాగుతున్నాయి. ప్రస్తుతమున్న భవనాలు, వసతిగృహం, ల్యాబ్, భూసార పరీక్షాకేంద్రం, పండ్లతోటలు, వాతావరణ కేంద్రం, పట్టణానికి అతిసమీపంలో, జగిత్యాల-నిజామాబాద్ జాతీయ రహదారిని ఆనుకుని ఉండటం కలిసివచ్చే అంశాలుగా ఉన్నాయి. దీనికిగాను చల్‌గల్ క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.


చల్‌గల్ ప్రదర్శనక్షేత్రం


వరిపై ప్రదర్శన

క్లస్టర్ కేంద్రాల్లో రైతు భవనాలు

(మొదటిపేజి తరువాయి భాగం) కేంద్రాలను నిర్వహిస్తున్నారు. వాటిలో సరైన వసతి లేక కేంద్రం నిర్వహణ, మినీ భూసార పరీక్షలు చేయడం ఇబ్బందిగా మారింది. భూసార పరీక్ష పరికరాలు, ద్రావణాలు అలంకారంగా మారాయి.

స్థలాల అన్వేషణలో అధికారులు

రైతు సముదాయ భవనాల నిర్మాణానికి మండల రెవెన్యూ అధికారులు మంచి స్థలాల కోసం అన్వేషిస్తున్నారు. కొన్ని మండలాల్లో స్థలాల ఎంపిక పూర్తి చేశారు. ఈ నెల 14 వరకు స్థలాల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా పాలనాధికారి డాక్టర్ శరత్ తహసీల్దారులను అదేశించారు. స్థలాలు అప్పగిస్తే స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఏఈవోలు అదే స్థలంలో జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. ఒక్కో భవనాన్ని 20 గుంటల స్థలంలో నిర్మించనున్నారు. క్లస్టర్ కేంద్రాల్లో ఏఈవో కార్యాలయం, మినీ భూసార పరీక్షా కేంద్రం, రైతులతో సమావేశాలు నిర్వహించేందుకు, ఎరువులు, విత్తనాలు నిల్వ చేసేందుకు అనువుగా రైతు సముదాయ భవనాలను నిర్మించనున్నారు. స్థలాల ఎంపిక పూర్తయితే ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుంది.

పుస్తకాలు రావు... పరీక్షలు ఆగవు

(మొదటిపేజి తరువాయి భాగం) సంఖ్య పెరగడంతో పాత విద్యార్థుల సంఖ్య ప్రకారమే పుస్తకాలు రాగా నూతన విద్యార్థులకు పుస్తకాలు లేక పాఠ్యాంశాలు తరగతిలో వినడానికి మాత్రమే పరిమితమయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పుస్తకాలు అందజేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

అర్థం చేసుకోవడం కష్టంగా మారింది

– శ్రీచరణ్, 6వ తరగతి, రామాజిపేట



ఈ ఏడాది మార్చిలోనే పాఠ్యాంశాలు ప్రారంభం కావడంతో ఉపాధ్యాయులు ఇప్పటికే మూడు పాఠ్యాంశాలు పూర్తి చేశారు. ఆలస్యంగా పాఠశాలలో ఆంగ్లమాధ్యమం ప్రారంభం కావడంతో ఇప్పటికీ పుస్తకాలు రాలేదు. దీంతో ఫార్మాటివ్-1 పరీక్షలు రాయడం చాలా కష్టంగా మారింది. పాఠ్యపుస్తకాలు లేక పోవడంతో పాఠాలు అర్థం చేసుకోవడం కష్టమవుతోంది. ఇప్పటికైనా పుస్తకాలు త్వరగా అందజేయాలి.

కలెక్టర్లకే దీపం కనెక్షన్ల అధికారం

జగిత్యాల, న్యూస్‌టుడే: దీపం కనెక్షన్ల మంజూరు బాధ్యతను జిల్లా కలెక్టర్లకే ఇచ్చినట్లు రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. గురువారం జిల్లా సంయుక్త కలెక్టర్లతో దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపం కనెక్షన్లపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి కుటుంబానికి గ్యాస్ సిలిండర్ ఉండేలా చూడాలన్నారు. కిరోసిన్ వినియోగం పూర్తిగా తగ్గించాలని చౌకధరల దుకాణాల డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వటం సాధ్యం కాదని కమీషన్ క్వింటాల్‌కు రూ.70 పెంచుతూ ప్రభుత్వం త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తుందన్నారు. నిత్యావసర సరకుల గోదాంల వద్ద వెయింగ్ బ్రిడ్జి ఏర్పాటు చేసి తూకంలో మోసం జరగకుండా చూస్తామన్నారు. చౌకధరల దుకాణాల వారీగా వినియోగదారుల మొబైల్ సీడింగ్ వందశాతం పూర్తి చేయాలన్నారు. సంయుక్త కలెక్టర్లు క్షేత్రపర్యటనలో ఖచ్చితంగా చౌకధరల దుకాణాలను తనిఖీ చేయాలని సీవీ ఆనంద్ అన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారుఖీ, పౌరసరఫరా డిప్యూటీ కమిషనర్ చంద్రప్రకాశ్, జిల్లా మేనేజర్ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.


వీసీలో పాల్గొన్న జేసీ ముషారఫ్ అలీ ఫారుఖీ

వానల్లేక అదును ఆలస్యం

(మొదటిపేజి తరువాయి భాగం) లేదు. కాలువనీళ్లు వచ్చే అవకాశం లేనందున పంటల సాగును ఆసాంతం పంపుసెట్ల ద్వారానే చేపడుతున్నారు. 120 రోజుల పంటకాలం కలిగిన స్వల్పకాలిక వరిరకాలతో ఆగస్టు నెలాఖరు వరకు వరినాట్లకు అవకాశముండగా లేట్ ఖరీఫ్ ప్రణాళికద్వారా ఆరుతడి పంటలైన మక్క, నువ్వు, జొన్న, సజ్జ, వేరుసెనగ సోయాబీన్ తదితర పంటలను విత్తుకునే అవకాశముంది. జిల్లాలో ఖరీఫ్‌లో అన్నిరకాల పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1,24,238 హెక్టార్లుండగా ఇప్పటి వరకు 74,643 హెక్టార్లలోనే పంటలను విత్తుకున్నారు. ఇప్పటి వరకు 60 శాతం విస్తీర్ణంలోనే పంటలను విత్తుకోగా వరినాట్లు, ఆరుతడి పంటలను విత్తుకోవటం పూర్తయితే సెప్టెంబరు మొదటివారం వరకు పంటలసాగు విస్తీర్ణం మరింతగా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు రసాయన ఎరువులను సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎ.అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. 43 రకాల కోర్సులు ఉన్నాయని 10వ తరగతి చదివి 19-30 ఏళ్ల మధ్య వయస్కులకు శిక్షణ ఇస్తామని ఆ సమయంలో ఉచిత భోజన, నివాస వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 16 నుంచి ప్రారంభయ్యే ఎంపిక కార్యక్రమంలో విద్యార్హత ధ్రువపత్రం, ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు. 16వ తేదీన జగిత్యాల ధరూర్ క్యాంపు కార్యాలయంలో జగిత్యాల గ్రామీణం, మేడిపల్లి, సారంగాపూర్, బీర్‌పూర్, కొడిమ్యాల 17న ధర్మపురి ఐకేపీ కార్యాలయంలో ధర్మపురి, బుగ్గారం, రాయికల్ కార్యాలయంలో రాయికల్, మల్లాపూర్ మండలాలకు 19న గొల్లపల్లి, వెల్గటూరు 21న మెట్‌పల్లిలో ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్లలో కోరుట్ల ఐకెపి భవన్‌లో, కోరుట్ల, కథలాపూర్ మండలాల వారు హాజరు కావచ్చని ఆమె తెలిపారు.

ఆర్యవైశ్యులను ప్రభుత్వం ఆదుకోవాలి

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఆర్యవైశ్య కుటుంబాలు పేదరికంతో కొట్టుమిట్టాడుతున్నాయని ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఆదుకోవాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దొంతుల రాజ్‌కుమార్, స్నేహాలయ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట కిరణ్‌లు డిమాండ్ చేశారు. గురువారం మెట్‌పల్లిలో స్నేహాలయ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యచరణ రూపొందించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యుల డిమాండ్లను పరిష్కరించాలని ఫ్లకార్డులను ప్రదర్శించారు. ప్రభుత్వం అన్ని వర్గాల వారిని అక్కున చేర్చుకొని ఆర్యవైశ్యులను చిన్నచూపు చూస్తుందన్నారు. స్నేహాలయ అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రతి మండలం నుంచి ఆర్యవైశ్యులు తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించేలా అందరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఉన్నత చదువులు చదివిన ఆర్యవైశ్య విద్యార్థులు రిజర్వేషన్లతో వెనకబడిపోతున్నారని, అందుకే వెయ్యి కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోట సుమన్, దొంతుల పవన్, గజవడ గంగాధర్, శ్రీనివాస్, చిటుమల్లి వెంకటేష్, స్వరూప, పావని, హిమజ, శైలజ, లక్ష్మి, హారీస, సరస్వతి తదితరులున్నారు.


ఫ్లకార్డులను ప్రదర్శిస్తున్న ఆర్యవైశ్య కుటుంబీకులు



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టాలి

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. గురువారం జగిత్యాల పట్టణంలోని కలెక్టరేట్ ముట్టడి సందర్భంగా కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ కేంద్రం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా వర్గీకరణ అంశంలో తాత్సారం సరికాదన్నారు. ఇరవై మూడేళ్ల ఉద్యమానికి తెర దించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ అఖిల పక్ష కమిటీ దిల్లీ తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెస్తేనే వర్గీకరణ అంశానికి తెరపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ ఇంఛార్జి మ్యాకల లక్ష్మణ్, నాయకులు దుమాల రాజ్‌కుమార్, పడిగెల చంద్రయ్య, రాజేందర్, భాస్కర్, నక్క జితేందర్, బొల్లె గంగారాం, శ్రీనివాస్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ విద్యార్థుల ప్రతిభ

మెట్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రుబెల్లా వ్యాక్సిన్‌పై మెట్‌పల్లి ఉర్దూ మీడియం పాఠశాలలో గురువారం నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో ఆత్మకూర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మాసం వైష్ణవి, ఏలేటి రుచితలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ఉపాధ్యాయుడు నరసింహచారి గైడ్ ఉపాధ్యాయుడిగా వ్యవహించారు. విజేతలను ప్రధానోపాధ్యాయుడు తాజొద్దీన్, ఉపాధ్యాయులు అభినందించారు.

తెరపై ఈనాడు



జగిత్యాల

బాలాజీ- ఫిదా
నటరాజ్ - జయ జానకి నాయకా
దుర్గరాజ - నక్షత్రం
శ్రీనివాస - లై
శ్రీరామా- నేనే రాజు నేనే మంత్రి

మెట్‌పల్లి

లక్ష్మి- జయ జానకి నాయకా
సాయికృష్ణ- నేనే రాజు నేనే మంత్రి

కోరుట్ల

లక్ష్మి- లై
కిన్నెర- నేనే రాజు నేనే మంత్రి

అంగన్‌వాడీ.. పచ్చదన ఒడి

4 వేల మొక్కలు నాటి సంరక్షించేలా కార్యాచరణ

న్యూస్‌టుడే, మంకమ్మతోట, (కరీంనగర్)

జిల్లాలో కరీంనగర్ అర్బన్, రూరల్, గంగాధర, హుజూరాబాద్ నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి.. వాటి పరిధిలో 777 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఒక్కో అంగన్‌వాడీ కేంద్రంలో ఐదు మొక్కలు చొప్పున 3885 నాటడంతో పాటు, పాటు మిగిలిన 115 మొక్కలు జిల్లా ప్రభుత్వ అంధులు, చెవిటి, మూగ బాలల పాఠశాల, బాలసదనం ప్రాంగణం, మహిళా వసతిగృహంలో నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

ఆదర్శం.. అంధ విద్యార్థులు: వారికి రెండు కళ్లు పనిచేయవు, ప్రకృతి పచ్చ అందాలను వారు చూడలేరు. కాని మాకెందుకులే ఈ హరితహారం అని ఊరుకోలేదు వారు. జిల్లా కేంద్రం సమీపంలోని ప్రభుత్వ అంధుల, చెవిటి మూగ పాఠశాల ప్రాంగణంలో అంధ విద్యార్థులు హరితహారంలో ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. ప్రకృతి, పర్యావరణం గురించి మాకెందుకులే అనుకొని కళ్లు ఉండి చూడలేని ఎందరో సకలాంగులకన్నా.. అంధత్వంతో ప్రకృతి అందాన్ని చూడకపోయిన మొక్కలు నాటి ఆదర్శంగా నిలుస్తున్నారు వారు.

మొక్కలు నాటాలి.. వాటిని సంరక్షించుకోవాలి, అంగన్‌వాడీ కేంద్రాలు.. హరిత నిలయాలుగా మారాలి అన్న లక్ష్యంగా ముందుకు పోతోంది జిల్లా మహిళా, పిల్లల, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ. వానరాలు వాపస్ పోవాలి.. వానలు వాపస్ రావాలి.. అన్న ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలను స్ఫూర్తిగా తీసుకున్న ఐసీడీఎస్ బృందం హరిత హారం విజయవంతం కావడానికి తన వంతు పాత్ర పోసిస్తోంది.

4 : ఐసీడీఎస్ ప్రాజెక్టులు

777 : అంగన్‌వాడీ కేంద్రాలు

పట్టణ ప్రాంత పరిధిలో అడ్డంకులు: అనుకున్న లక్ష్యం ప్రకారం ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఐదు మొక్కలకు తక్కువ కాకుండా నాటాలనుకున్న లక్ష్యానికి పట్టణ ప్రాంత అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని చోట్ల అవకాశం లేకుండా పోయింది. చాలా కేంద్రాలు స్వతంత్రంగా లేకపోవడం, అద్దె ఇళ్లు కావడంతో మొక్కలు నాటడానికి ఇబ్బందులున్నాయి. అడ్డంకులు ఎదురైనా అనుకున్న లక్ష్యం సాధించాలనే నిర్ణయం మేరకు ఐదు మొక్కలు నాటడం వీలుకాని మొక్కలను, నాటడానికి అవకాశం ఎక్కువగా ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో, అర ఎకరమున్న బాలసదనం ప్రాంగణం, ప్రభుత్వ అంధులు, చెవిటి పాఠశాల తదితర చోట్ల ఎక్కువ మొత్తంలో మొక్కలు నాటాలని నిర్ణయించారు. పట్టణ ప్రాంత కేంద్రాల దగ్గర అవకాశమున్న మేరకే మొక్కలు నాటాలని నిర్ణయించారు.



గత సంవత్సరం బాలసదనంలో నాటగా, ఏపుగా ఎదిగిన పూల మొక్కలు

అనుకున్న లక్ష్యం సాధిస్తాం

- ఎం.శారద, జిల్లా సంక్షేమ అధికారి



జిల్లా వ్యాప్తంగా మా శాఖ ఆధ్వర్యంలో మూడు నెలల కాలంలో 4 వేల మొక్కలు నాటి వాటిని సంరక్షించడం లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. ఇప్పటి వరకు 1500 మొక్కలు నాటాం. కొన్ని గ్రామాల పరిధిలో ఇంకా మొక్కలు అందాల్సి ఉంది. మేం నిర్దేశించుకున్న కాలపరిమితిలో 4 వేల మొక్కలు నాటే లక్ష్యం అధిగమిస్తాం. రోజూ జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎన్ని మొక్కలు నాటారు.. వాటి సంరక్షణ కోసం తీసుకున్న చర్యలపై వివరాలు తెప్పించుకొని, తగు సూచనలు, సలహాలు ఇస్తున్నాను.



బాలసదనం ప్రాంగణం ఆవరణలో మొక్కలు నాటుతున్న నగర మేయర్ రవీందర్ సింగ్



రేకుర్తి అంధుల పాఠశాలలో మొక్కలు నాటుతున్న అంధ విద్యార్థులు

సమష్టి భాగస్వామ్యం

లెక్క కోసం మొక్కలు నాటితే సరిపోదని, వాటిని సంరక్షించి పెద్ద చేయాల్సిన బాధ్యత కూడా మనమే తీసుకోవాలని ఐసీడీఎస్ జిల్లా సంక్షేమ అధికారి ఎం. శారద అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక సూచనలు ఇస్తున్నారు. మొక్కలను రక్షించడానికి కావాల్సిన ట్రీగార్డుల ఏర్పాటు కోసం స్థానిక ప్రజాప్రతినిధుల సహాయం తీసుకోవాలని, గ్రామ స్థాయిలో సర్పంచి, పట్టణ ప్రాంతాల్లో కౌన్సిలర్, కార్పొరేటర్ల ద్వారా ట్రీగార్డులు సమకూర్చుకోవాలని, నాటిన మొక్కలకు నీరు పోయడాన్ని సమష్టి బాధ్యతగా ప్రచారం చేయాలని వారికి సూచించారు. అందుకోసం అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు, చిన్నారులు, స్థానికులను భాగస్వామ్యం చేయాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు రేపు

మార్కండేయకాలనీ, న్యూస్‌టుడే: సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు శనివారం గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు కరీంనగర్ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సత్యం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని బాలురు, బాలికలు పోటీలకు హాజరుకావాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, 01-01-2002 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. పోటీల్లో పాల్గొనే బాల, బాలికలు ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, ఫొటోలు వెంట తీసుకరావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.



నది ఒడ్డున.. నిర్లక్ష్యం నీడన!

న్యూస్‌టుడే, ధర్మపురి: ధర్మపురి వద్ద గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు నిత్యం వందలాది మంది భక్తులు వస్తుంటారు. శ్రావణ మాసంలో ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటోంది. కాగా భక్తులకు వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో గత పుష్కరాల సందర్భంగా పది వరకు మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేశారు. వీటిలో చాలా వరకు బాగానే ఉన్నాయి. కొద్దిపాటి మరమ్మతులు చేస్తే సరిపోతుంది. నిత్యం వచ్చే భక్తులకు ఇవి ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయి. గత ఏడాది వరదల సమయంలో కొట్టుకుపోయిన వాటిని పంచాయతీ వారు బయటకు తీసి తాత్కాలికంగా నది ఒడ్డున ఏర్పాటు చేశారు. అయితే వాటిని వినియోగంలోకి తెచ్చే విషయమై దృష్టి పెట్టలేదు. ఇప్పటికైనా షెడ్లకు మరమ్మతు చేసి వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది.

ఉమ్మడి కౌన్సెలింగ్ తేదీల ప్రకటన

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే : తెలంగాణ ఎంసెట్-2017 ర్యాంకుల ఆధారంగా వ్యవసాయ డిగ్రీ, ఉద్యాన, పశుసంవర్థక మత్స్య డిగ్రీకోర్సుల్లో చేరికకు ఉమ్మడి కౌన్సెలింగ్ తేదీలను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సుధీర్‌కుమార్ విడుదల చేశారు. ఇది వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన విద్యార్థులు వారి ర్యాంకులను బట్టి నిర్ధేశిత తేదీల్లో కౌన్సెలింగ్‌నకు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 6 వరకు ర్యాంకులు, రిజర్వేషన్లను బట్టి కౌన్సెలింగ్ జరిపి సీట్లను కేటాయిస్తారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆడిటోరియంలో రోజూ ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు జరిపే కౌన్సెలింగ్‌నకు వారివారి ర్యాంకులను బట్టి హాజరు కావాల్సి ఉంటుంది. విద్యార్థులు హాజరు కావాల్సిన తేదీలు, ఫీజులు, రిజర్వేషన్ల వర్తింపు తదితర అన్ని వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరచారని, దరఖాస్తు చేసినవారు వెబ్‌సైట్‌లో చూసుకుని కౌన్సెలింగ్‌కు వెళ్లాలని పొలాస వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాంరెడ్డి సూచించారు.

'వారసత్వ ఉద్యోగాలపై శాసనసభలో తీర్మానం'

యైటింక్లయిన్‌కాలనీ : సింగరేణి సంస్థలో వారసత్వ ఉద్యోగాలపై ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలంగాణ బొగ్గుగని కార్మికసంఘం ప్రధానకార్యదర్శి కెంగర్ల మల్లయ్య అన్నారు. గురువారం ఆర్జీ-2 డివిజన్‌లోని జీడీకే-7ఎల్ఈపీ గని ఆవరణలో నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారసత్వ ఉద్యోగాల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని, త్వరలోనే కార్మికులకు తీపి కబురు అందుతుందన్నారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరం కార్మికులకు రావాల్సిన లాభాల వాటా అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని, దీని కోసం త్వరలో తాము ముఖ్యమంత్రిని కలువనున్నట్లు పేర్కొన్నారు. చిత్తశుద్ధ ఉన్న జాతీయ సంఘాలు కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేసుకొని రావాలని, లేకుంటే కార్మికులే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఐలి శ్రీనివాస్, కె.సత్యనారాయణరెడ్డి, స్వామి, ప్యారామియ్యా పాల్గొన్నారు.

దళితుల మహాధర్నా 23న

కరీంనగర్ (మంకమ్మతోట),న్యూస్‌టుడే : దళిత, గిరిజన, మైనార్టీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా 23న దిల్లీ జంతర్‌మంతర్ వద్ద దళితుల మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మేడి అంజయ్య తెలిపారు. గురువారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరి, పోలీస్ వ్యవస్థ నిర్లక్ష్యం మూలంగా దళితులపై దాడులు పెరిగాయన్నారు. రాజ్యాంగం ద్వారా దళితులకు సంక్రమించిన హక్కులను కాలరాస్తున్న పాలకుల తీరును ఎండగడుతూ చేపడుతున్న మహాధర్నాకు జిల్లా నుంచి పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో సదానందం, సాగర్, మేడి రాజవీరు, దామెర సత్యం తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల

చిన్నారులకు నాణ్యమైన సరకులు అందించాలి

రాయికల్, న్యూస్‌టుడే: చిన్నారులకు నాణ్యమైన సరకులు అందించాలని వస్తాపూర్ గ్రామ ఉపసర్పంచి కోల రాజలింగం అన్నారు. గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు నాసిరకంగా కోడిగుడ్లు అందజేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నారు.


నిరుపేద వివాహానికి ఆర్థికసాయం

జగిత్యాల పట్టణం: మల్యాల మండలానికి చెందిన నిరుపేద యువతి శిరీష వివాహానికి భక్తమార్కండేయ యువజన స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు గురువారం రూ.10 వేల ఆర్థికసాయాన్ని యువతి కుటుంబానికి అందజేశారు. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గాజెంగి శేఖర్ అందించిన నగదును సభ్యులు సాయం చేశారు. పద్మశాలి సంఘ నాయకులు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

సొంతింటి కల..సాకారమయ్యేనా?

☛ ప్రారంభం కాని రెండు పడక గదుల ఇళ్లు ☛ ఏడాదిన్నరగా లబ్ధిదారుల ఎదురుచూపు

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: గూడు లేని నిరుపేదలకు సొంత ఇంటి నిర్మాణం కలగా మారింది. గూడు లేని నిరుపేదలకు నీడ కల్పించాలనే ఉద్దేశ్యంతో తెరాస ప్రభుత్వం కొలువుదీరగానే అన్ని వసతులతో కూడిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందుకు తొలి విడతగా నియోజకవర్గానికి 400ఇళ్లు కేటాయించగా రాయికల్ మండలానికి 100 ఇళ్లు మంజూరయ్యాయి. లబ్ధిదారుల ఎంపిక పూర్తయి ఏడాదిన్నర పూర్తయినా ఇళ్ల నిర్మాణాల పనులు మందుకు సాగక ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. తమకు కేటాయించిన ఇళ్లు ఎప్పుడు పూర్తవుతాయో తెలియక లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. ఎంపికైన లబ్ధిదారులు నిరుపేద కుటుంబానికి చెందడంతోపాటు అద్దె ఇళ్లలో, గుడిసెలు ఏర్పాటు చేసుకొని ఇరుకు గదుల్లో జీవనం సాగిస్తున్నారు.




రాయికల్‌లో ఇళ్ల నిర్మాణానికి కేటాయించిన లే అవుట్

దరఖాస్తులకు అనూహ్య స్పందన

మండలానికి 100 రెండు పడకల గదుల ఇళ్లు మంజూరవ్వగా రాయికల్ మండల కేంద్రానికి 60, మండలంలోని దావన్‌పల్లి గ్రామానికి 20, కట్కాపూర్ గ్రామానికి 20 ఇళ్లను కేటాయించారు. లబ్ధిదారుల ఎంపికకు 2015లో దరఖాస్తులు ఆహ్వానించగా రాయికల్ మండల కేంద్రానికి 60 ఇళ్లకుగాను 1211, దావన్‌పల్లిలో 20 ఇళ్లకు గాను 34, కట్కాపూర్‌లో 20 ఇళ్లకు 61 మొత్తంగా 1306 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం అందజేసిన విధివిధానాల మేరకు అధికారులు అయిదు బృందాలుగా ఏర్పడి ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులను గుర్తించారు. రాయికల్‌లో 126 మంది, కట్కాపూర్‌లో 20, దావన్‌పల్లిలో 20 మంది అర్హులను గుర్తించారు. రాయికల్‌లో 60 ఇళ్లకు 126 మంది అర్హులు ఉండగా గత సంవత్సరం ఫిబ్రవరి 22న మండల కేంద్రంలోని మండల క్లబ్ కల్యాణ మండపంలో డ్రా నిర్వహించి 60 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు.

తప్పని ఎదురు చూపులు

మండలంలోని కట్కాపూర్, దావన్‌పల్లిలో ఇళ్ల నిర్మాణానికి స్థలం విషయంలో ఇబ్బందులు లేకపోగా ఇళ్లను నిర్మించడానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదు. రాయికల్‌లో 60 ఇళ్ల నిర్మాణాల కోసం రెవెన్యూ అధికారులు రాయికల్ శివారులోని 146 సర్వే నంబర్‌లో 1.03 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. ఆరు మాసాల క్రితమే ఈ ప్రభుత్వ భూమిని ఇళ్ల నిర్మాణాల కోసం పంచాయతీ రాజ్ విభాగానికి అప్పగించారు. మండలంలో రెండు పడకల గదుల ఇళ్ల నిర్మాణానికి 16 జూన్ 2017న ఎంపీ కవిత, శాసనసభ్యుడు జీవన్‌రెడ్డితో కలిసి పనులను ప్రారంభిస్తూ శిలాఫలకాలు ఆవిష్కరించినా క్షేత్రస్థాయిలో పనులు మాత్రం ప్రారంభం కాలేదు. రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించి పనులు వేగవంతం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



రాయికల్‌లో రెండు పడకల ఇళ్లకు కేటాయించిన ప్రభుత్వ స్థలం

వానలో నిలువ నీడ కరవు

-చిక్కాల రాజేశ్వరి, రాయికల్

రెండు పడక గదుల ఇళ్లకు దరఖాస్తు చేసుకొగా ఏడాదిన్నర క్రితమే ఇళ్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. అప్పటి నుంచి ఇళ్లు ఎప్పుడు నిర్మిస్తారా అంటూ ఎదురు చూస్తూనే ఉన్నాం. ఎండకు ఎండుతూ, వానలో తడుస్తూ తత్కాలిక గుడిసెను ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాం. రోజువారి కూలీ పనులు నిర్వహించుకునే మాకు అద్దె ఇంటిలో ఉండే స్తోమత కూడా లేదు. ప్రభుత్వం మా ఇబ్బందులను గుర్తించి త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేయాలి.

ఇంటి నిర్మాణ వ్యయం పెంచాలని నివేదించాం

-వెంకటప్రసాద్, ఏఈ, పంచాయితీ రాజ్ విభాగం

మండలంలోని దావన్‌పల్లి, కట్కాపూర్ గ్రామాల్లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. రాయికల్‌లో ఇళ్ల నిర్మాణానికి నిర్దేశించిన స్థలం లోతట్టు ప్రాంతంలో ఉండటంతో ఇళ్ల పునాదులను పటిష్ఠంగా నిర్మించాల్సి ఉంటుంది. ప్రభుత్వ వ్యయం రూ.5.04లక్షల కంటే ఇళ్ల నిర్మాణానికి అంచనా వ్యయం పెరిగింది. అంతేకాకుండా రాయికల్‌లో 60 మంది లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు అప్పటించిన1.03 ఎకరాల ప్రభుత్వ స్థలంలో జి ప్లస్ వన్ నమూనాలో ఇళ్ల నిర్మాణాలు జరిపితే కేవలం 44 మంది లబ్ధిదారులకే ఇళ్లు అందించవచ్చు. మిగిలిన 16 మందికి ఇళ్ల స్థలాల కొరత ఉంది. జి ప్లస్ టు నమూనాల్లో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు రావాలి. ఈ సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం. వారి ఆదేశాల మేరకు ఇళ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటాం.



మంగెళలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేస్తున్న దృశ్యం

బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలి

బీర్‌పూర్, న్యూస్‌టుడే: ఏకీకృత సర్వీస్ నిబంధనల ప్రకారం బదిలీలు, పదోన్నతులు వెంటనే కల్పించాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం బీర్‌పూర్ మండలంలోని పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధ్యాయులకు నగదు రహిత వైద్య కార్డులు అందించాలని కోరారు. పరీక్షలను సీసీఈ విధానాన్ని ఎత్తివేయాలని, సకాలంలో పీఆర్సీ అందించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు బీమయ్య, రాంరెడ్డి, మండల పీఆర్టీయూ అధ్యక్షుడు బానుక శ్రీనివాస్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం చేయడం తగదు

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: సభలు, సమావేశాల పేరిట తెరాస ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం తగదని పట్టణ భాజపా, భాజయుమో నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం జగిత్యాలలో నిర్వహించిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ పాఠశాలలు బంద్ చేయించి బస్సులను సమావేశం కోసం మళ్లించడం, బస్సుల్లో బీరు, బిర్యానీ పెట్టి లను తరలించడం తెరాసకే చెల్లిందని ఆరోపించారు. వాహనాలను తరలించడంతో ఏర్పడిన రద్దీ వల్ల సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ప్రజాక్షేత్రంలో తెరాస ప్రభుత్వానికి శిక్ష పడటం ఖాయమని పేర్కొన్నారు. సమావేశంలో భాజపా, భాజయుమో పట్టణ అధ్యక్షులు ఆన్‌కార్ సుధాకర్, ఆముద రాజు, సీనియర్ నాయకులు ఏసీఎస్ రాజు, సీపెల్లి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిషోర్‌సింగ్, లింగంపేట శ్రీనివాస్, మాడిశెట్టి మల్లేశం, బడే శంకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందిస్తున్న తెదేపా నాయకులు

వైద్య కళాశాల ఏర్పాటుకు వినతి

సారంగాపూర్, న్యూస్‌టుడే: జగిత్యాల జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని తెదేపా నాయకులు గురువారం తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. గతంలో ఎన్నికల హామీల్లో భాగంగా జగిత్యాలలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారని, ఇప్పటికీ ఆచరణకు నోచుకోలేదన్నారు. పక్కనే ఉన్న నిర్మల్, ఆదిలాబాద్, కొమురంభీం జిల్లాలకు జగిత్యాల కేంద్రంగా ఉంటుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జగిత్యాలలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు దిల్లీ రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు అనంతుల గంగారెడ్డి, బొమ్మకంటి ప్రమోద్, అనంతుల స్వామి, కుసుంబ సంతోష్‌నేత, బోదాసు రామానుజం, పసుల దేవయ్య, ఎండబెట్ల కిశోర్, కుసుంబ చందు, తదితరులు పాల్గొన్నారు.

పునరుజ్జీవన పథకంతో సస్యశ్యామలం

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: ఎల్లంపల్లి నుంచి నీటిని వరదకాలువ ద్వారా శ్రీరామ్‌సాగర్‌లోకి ఎత్తిపోసేలా చేపట్టిన పునరుజ్జీవన పథకం పూర్తయితే జగిత్యాల ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు శీలం ప్రియాంక పేర్కొన్నారు. గురువారం జగిత్యాల మార్కెట్ వద్ద నుంచి 7 బస్సుల్లో 350 మందితో కలిసి పోచంపాడు వద్ద సీఎం కేసీఆర్ నిర్వహించిన పునరుజ్జీవన సభకు తరలి వెళ్లారు. శీలం ప్రవీణ్, రాంరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలున్నారు.

రాయికల్: శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకాన్ని ప్రారంభించేందుకు నిజామాబాద్ జిల్లా పోచంపాడుకు వస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు మండలంలోని అల్లీపూర్, మైతాపూర్, ఇటిక్యాల, భూపతిపూర్, రామాజిపేట,మూటపల్లి, కొత్తపేట, తాట్లవాయి, అయోధ్య, కిష్టంపేట, సింగరావుపేట తదితర గ్రామాల నుండి గురువారం ఉదయం భారీ సంఖ్యలో తెరాస కార్యకర్తలు బస్సులలో తరలి వెళ్లారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు అభివృద్ధితో మండలంలోని అనేక గ్రామాలకు సాగు నీరు అందుతుందని నాయకులు పేర్కొన్నారు.

సారంగాపూర్: పోచంపాడ్‌లో కేసీఆర్ బహిరంగ సభకు తెరాస నాయకులు సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల నుంచి జనసమీకరణ చేశారు. ఆయా మండలాల రైతులు, మహిళా సంఘాల సభ్యులు, తెరాస కార్యకర్తలను ఆర్టీసీ, ప్రయివేటు వాహనాలతో పాటు ట్రాక్టర్లు ఇతర వాహనాల్లో కూడా తరలించారు. కార్యక్రమంలో తెరాస సీనియర్ నాయకుడు ముప్పాల రాంచందర్‌రావు, ఎంపీపీ కొల్ముల శారద, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు గుర్రాల రాజేందర్‌రెడ్డి, నారపాక రమేష్, సింగిల్ విండో అధ్యక్షుడు సత్యంరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొల్ముల రమణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాయికల్ పట్టణం: పోచంపాడులో తెరాస నిర్వహించిన పునరుజ్జీవ సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి వేలాదిగా కార్యకర్తలు, రైతులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా తెరాస కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో తెరాస సీనియర్ నాయకులు మోర హన్మండ్లు, ఇంతియాజ్, అనీల్‌కుమార్, కొల్లూరి వేణు తదితరులు పాల్గొన్నారు.



సారంగాపూర్ నుంచి తరలివెళ్తున్న మహిళా సంఘాల సభ్యులు



నాయకులు కార్యకర్తలతో మార్కెట్ అధ్యక్షురాలు ప్రియాంక



అల్లీపూర్‌లో తరలివెళుతున్న తెరాస నాయకులు

జగిత్యాల

పరిమితి మేరకు రుణాలివ్వాలి

జగిత్యాల ధరూరుక్యాంపు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఈసారి స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్ పరిమితిని పెంచగా రైతులకు పరిమితి మేరకు పంటరుణాలను అందించాలని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి మహంకాళి రాజన్న కోరారు. ఇప్పటివరకు ఖరీఫ్ రుణలక్ష్యం కన్నా చాలా తక్కువగా పంపిణీ చేశారని, ఇచ్చిన చోట్ల కూడా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను పాటించటం లేదన్నారు. లక్ష్యం మేరకు రుణాలను అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

యాదవులకు నగదు అందిస్తేనే మేలు

☛ గొర్రెల పథకం దళారుల కోసమే.. ☛ సీఎల్పీ ఉపనేత టి. జీవన్‌రెడ్డి



ధర్మారంలో యాదవులకు గొర్రెలను అందిస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: గొర్రెల పథకం కొనుగోళ్లలో లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రభుత్వం వారికి నగదు రూపేణా చెల్లిస్తే మంచి గొర్రెలను వారే కొనుగోలు చేసుకుని లబ్ధిపొందే అవకాశం ఉందని సీఎల్పీ ఉపనేత, జగిత్యాల ఎమ్మెల్యే టి.జీవన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. జగిత్యాల మండలం జాబితాపూర్‌లో గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా యాదవులకు గురువారం గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు చేసిన గొర్రెలను ఆయన పరిశీలించారు. తెచ్చిన వాటిలో నాలుగు గొర్రెలు మృతి చెందాయని, చిన్నసైజు గొర్రెలకు సైతం రూ.6 నుంచి రూ.7 వేలు చెల్లించాల్సి వస్తోందని, పథకం ద్వారా తీవ్రంగా నష్టపోతున్నామని బొమ్మెన శ్రీనివాస్ అనే గొర్రెల కాపరి ఎమ్మెల్యేకు వివరించారు. పథకంలో 75 శాతం సబ్సిడీ వస్తున్నా కొనుగోళ్లలో ధరలు ఎక్కువ చెల్లించటంతో సబ్సిడీ 30 శాతానికి మించటం లేదని పథకంలో దళారులకే మేలు చేకూరుతుందని తమకు అన్యాయం జరుగుతోందని గొర్రెల కాపరులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గొర్రెల పంపిణీ పథకం వల్ల యాదవులకు మేలు చేకూరుతుందని కానీ పథకం లోపభూయిష్టం కారణంగా లబ్ధిదారులు నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా రూ.3 వేలకు లభించే గొర్రె రూ.7 వేలు వెచ్చించాల్సి వస్తుందన్నారు. విధి విధానాల్లో లోపాలున్నాయని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవటం లేదన్నారు. ఎక్కువ ధరలకు కొనుగోలు చేయటంతో లబ్ధిదారుకు సబ్సిడీ 30 నుంచి 50 శాతానికి మించటం లేదని ఎమ్మెల్యే అన్నారు. లబ్ధిదారులకే నగదు రూపంలో చెల్లిస్తే వారే మంచి గొర్రెలు కొనుగోలు చేసుకునే అవకాశం ఉందని, ప్రభుత్వం విధానాలను మార్చాలని ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 నుంచి 80 లక్షల గొర్రెలను పంపిణీ చేస్తున్న ప్రభుత్వం 1500 పశువైద్యులను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. స్థానిక పశువైద్యాధికారులను చనిపోయిన గొర్రెల వివరాలు కోరితే నెల దాటుతున్నా ఇంత వరకు ఇవ్వలేదని మండిపడ్డారు. సర్పంచి మల్లేశం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గంగం మహేశ్, పన్నాల తిరుపతిరెడ్డి, యాదవ సంఘ్య అధ్యక్షుడు మల్లేశ్, ఉప సర్పంచి దనేశ్వర్‌రావు, ఎంపీటీసీలు నక్క తిరుపతి, శ్రీరాముల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయవాడలో సీసీ రోడ్లు నిర్మించరూ..

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని రెండో వార్డులో సీసీ రోడ్లు లేక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో మురుగు కాల్వల నిర్మాణం పూర్తయినా సీసీ రోడ్లు లేకపోవడంతో వర్షం కురిస్తే వర్షపు నీరు నిలిచి రహదారి బురదమయంగా మారుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కాలనీలో సిమెంట్ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



2వ వార్డులో సీసీ రోడ్లు లేని దృశ్యం

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న దృశ్యం

రాయికల్ పట్టణం: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నట్లయితే వ్యాధులు దరిచేరవని రాయికల్ జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కడార్ల లక్ష్మీనర్సయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలల్లో వైద్య సిబ్బంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరశర్మ, మంజులారాణి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల, న్యూస్‌టుడే: పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జగిత్యాల ఎమ్మెల్యే టి.జీవన్‌రెడ్డి అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మైనారిటీ గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే శారీరక, మానసిక ఎదుగుదల సాధ్యమవుతుందని ఫలితంగా చదువులో రాణిస్తారన్నారు. చిన్నప్పటి నుంచి పిల్లల ఆరోగ్య తీరును పరిశీలించి ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు ఉండవని జీవన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో పిల్లలకు నులిపురుగు నివారణ మాత్రలు వేశారు. జిల్లా వైద్యాధికారి సుగంధిని, ఉపవైద్యాధికారి జైపాల్‌రెడ్డి, ఆర్డీవో డాక్టర్ నరేందర్, తహసీల్దార్ రాజమనోహర్, పురపాలక ఛైర్‌పర్సన్ టి.విజయలక్ష్మి, వైస్‌ఛైర్మన్ సిరాజొద్దీన్ మన్సూర్, ఎంపీపీ గర్వందుల మానస, మైనారిటీ సంక్షేమ శాఖ పర్యవేక్షకుడు మహబూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల వాణిజ్యం: జగిత్యాలలోని పురాణిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. వైద్యాధికారి శ్రీనివాస్, పీఎంపీల అధ్యక్షుడు రాజగోపాలాచారి, హెచ్‌ఎం శంకర్‌రావు, జయశ్రీ, శ్రీనివాస్, ఉమాదేవి, ఫణిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలంలోని పలు పాఠశాలల్లో నులి పురుగుల నివారణ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్య సిబ్బంది విద్యార్థులకు మాత్రలు వేశారు. సర్పంచి ముక్కా శంకర్, ప్రధానోపాధ్యాయురాలు రాపర్తి విజయలక్ష్మీ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను జగిత్యాల మండలం అంతర్గాం సమీపంలో జగిత్యాల రూరల్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. టిప్పర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇ. కిరణ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: తెరాస ప్రభుత్వం సమావేశాల కోసం పాఠశాలలను మూసివేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని నియోజకవర్గ ఎన్‌ఎస్‌యుఐ అధ్యక్షుడు బాగోజి ముఖేశ్‌ఖన్నా తదితరులు ఆరోపించారు. గురువారం జగిత్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సభ కోసం సెలవులు ప్రకటించి బస్సులను మళ్లించడం అధికార దుర్వినియోగమని విమర్శించారు. తెరాస ప్రభుత్వం ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యుఐ, యువజన కాంగ్రెస్ నాయకులు ముంజాల రఘువీర్‌గౌడ్, నరేశ్‌కుమార్, అంజి, రాజేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

EENADU CLASSIFIEDS

AUTOMOTIVE

VEHICLES FOR SALE

Green Honda Offering Exchange Cars for Sale @ Reasonable Price, Mahindra Logan DLS, 1.3K Driven, 2008 Model. S Biege Colour, insurance available for more details Contact: 9100032923

BUSINESS SERVICES

BUSINESS OFFER

శ్రీ అన్నయ్ క్యాండిల్స్ ట్రైనింగ్ ఉచితం కొవ్వొత్తులు చెసై. రోజు 3,000 సంపాదించుకోవచ్చు. అచ్చు మైనము మేము ఇస్తాము. No Charges. ✆ 07338784267, 09790852975.

సత్యదేవ - ప్లాస్టిక్ వస్తువులు తయారుచేయు మెషిన్లు అమ్మకం. నెలకు 20 వేలు పైగా ఆ॥, ముడిసరుకు ఇచ్చి తయారైనవి కొంటాం, 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. ✆ 77995 18807.

తక్కువ పెట్టుబడితో ఇంట్లోనే ఉంటూ పేపర్ ప్లేట్స్ తయారుచేసే మెషిన్లు కలవు. ముడిసరకు ఇస్తాం, తయారైనవి మేమే కొంటాం, అగ్రిమెంట్ కలదు, Govt. రిజిస్ట్రేషన్. సాయి విగ్నేష్ ఏజెన్సీస్, ✆ 99630 02088.

మంచి వ్యాపార అవకాశం. 5-30% డిస్కౌంట్‌తో మీకు నచ్చిన బ్రాండెడ్ కిరాణా పొందండి. రికమెండ్ ద్వారా అధిక ఆదాయం. స్టాకిస్టులు కావలెను. ✆ 81063 38009, 98480 67455.

READYMADE & TEXTILES

భారీ డిస్కౌంట్ ఆఫర్ ముందెప్పుడు లేనివిధంగా సారీస్, రెడిమేడ్స్, మెటీరియల్స్, టాప్స్‌పై హోల్‌సేల్ ధరల కంటే తక్కువ ధరలకే, స్టాక్ క్లియరెన్స్ సేల్, వీకెంట్ ప్రత్యేక ఆఫర్ (Aug 10 - Aug 16) స్టాకు ఉన్నంతవరకే. బ్రాండెడ్ ఇన్నర్‌వేర్ & లెగ్గింగ్‌లపై భారీ తగ్గింపు. సుప్రియ ఫ్యాషన్స్, క్రిస్టియన్ కాలనీ, కరీంనగర్. ✆ 95021 32576.

HEALTH CARE

AYURVEDIC

మావద్ద అన్ని రకాల వ్యాధులకు గ్యారంటీ చికిత్స చేసి ఆయుర్వేద మందులు ఇవ్వబడును. సంప్ర॥ ఖాన్ సాప్ అహ్మద్‌పుర, KNR పాత శిశుమందిర్ స్కూల్ దగ్గర. సెల్: 90303 83427.

MARRIAGE SERVICES

మీ జీవితాంతం తోడుంటారనుకున్న జీవిత భాగస్వామి దూరమయ్యారని చింతించకండి. 1వ, 2వ, లేట్ మ్యారేజ్‌లకు & అన్ని కులాల పెండ్లి సంబంధాలకై సంప్ర॥ హరిహర మ్యారేజ్ బ్యూరో, KNR. Cell: 98496 51552.

PERSONAL CLASSIFIEDS

LOST

MA.Matheen S/o Abdulmazeed p.s.no: G4480607 బొమ్మకల్ to కరీంనగర్‌కి వెళ్ళేమార్గమధ్యంలో పాస్‌పోర్ట్ పోయినది. దొరికినవారు సంప్రదించవలెను. Cell: 90144 89687.

REAL ESTATE

HOUSE FOR SALE

శామీర్‌పేట దగ్గర విల్లాప్లాట్స్ & HMDA గేటెడ్ కమ్యూనిటీలో 2 BHK ఇండిపెండెంట్ ఇండ్ల ధర రూ॥ 24 లక్షలు. 80% బ్యాంక్ లోన్‌తో సేల్‌కు కలవు. స్కైవే, జీనోమ్ వ్యాలీ, Hyd. ✆ 77020 16545.

PLOT FOR SALE

Medchal Open Plot 518 Sq.Yards behind Bus depot, West Face, 15,000/- per Sq.Yds, Negotiable. Phone: 93910 02354, Con: 8 am to 9 pm.

వరంగల్ హైవే బీబీనగర్, నిమ్స్, రైల్వే Hub దగ్గరలో కే॥ 2.77 లక్షలకే అన్ని డె॥తో చుట్టూ 10 అడుగుల గోడతో 24 శ్రీగంధం మొక్కలతో ప్లాట్స్: 9246117999

అతివేగంగా అభివృద్ధి చెందుతున్న యాదగిరిగుట్టలో సకల సౌకర్యాలు గల హైవే ఫేసింగ్ లే అవుట్స్‌లో ప్లాట్లు కలవు. EMI సదుపాయం కలదు. (ఏజెంట్లు కావలెను) ✆ 9052055666

కరీంనగర్‌లోని కోర్టు ఎదురుగా, గోపీకృష్ణ ఫంక్షన్ హాల్ వెనకాల ఒక గుంట (25x44, 122 Yads) సర్వే నం. 1305 లో గల ప్లాట్ నం. 83 అమ్మకమునకు కలదు. సం॥ 7893325924.

JOBS

Urgently required for Angels: Hair, Skin & Body Care. Well Experienced Doctors (BHMS)/ Physiotherapist/ Dieticians/ Managers/ Counsellors/ Front Office Executive. Qualifification: Any Graduation. Therapist: Inter or Degree. All above Positions only for Females. Contact: 88866 22229, 88866 33339, 99481 13699. Email: hr@angelsclinic.in

Wanted to teach Higher Biology, Computers, IIT Faculty for E/M. Near Varahaswamy Temple, Bommakal Road, Karimnagar. ✆ 95026 51843, 99856 48964.

Wanted Relationship Manager For Life Insurence Company Qly: Any Degree + 2years Any Sales Experiance, Salary: 18000-25000/-, + Inct. Cell: 80748 40929.

URGENT Req: Sales Managers in Star Health Ins. Co. Your area wise. Good Salary+ Incentives. ✆ 7799558844/ 7799323478.

Wanted Lecturers For Degree Subject English,Botany,Zoology Intrested Candidates .SLN Degree College Gundlapally. 99899 18782, 99634 59280.

Wanted Computer Faculty Degree College in Vemulawada. Contact: 97030 85715.

